


# సితార కథ

## - జగన్నాయకి -

డిసెంబరు నెల ముప్పై ఒకటవ తేదీ! అర్ధరాత్రి అవటానికి అరగంట ఉంది! ఆ రాత్రి విద్యుద్దీపాలతో వెలిగిపోతున్న భాగ్యనగరం వెలుగు పూల నల్ల దుప్పటి కప్పుకున్నట్లుంది.

ఆ నగరంలో, ఆ మూల, ఆ సౌధం కోటి కాంతులతో వెలిగిపోతోంది. అమర్చిన విద్యుద్దీపాల కాంతి ఆ సౌధాన్ని మరింత అందాలతో అలంకరించింది! భాగ్యనగరంలోని భాగ్యమంతా తనలోనే దాచుకున్నట్లు ఠీవిగా నిలబడి ఉంది ఆ సౌధం. ఆ సౌధం మధ్య హాలులో అనేకమంది సినీ ప్రముఖులు కొత్త సంవత్సరానికి స్వాగతం చెప్పటానికి ఎదురుచూస్తున్నారు! దాదాపు అందరి చేతుల్లో మత్తుపానీయాల గ్లాసులు ఉన్నాయి! వారికెదురు గుండా, తెల్లగుడ్డ పరిచి ఉన్న పెద్ద టేబిల్ మీద వెండి పాత్రల్లో అనేక రకాల భక్ష్యాలు నోరూరిస్తున్నాయి. వారంతా తింటూ, తాగుతూ, తమ ఉనికినే మరిచిపోయేలా ప్రవర్తిస్తున్నారు.

ఇంతలో గడియారం లోని పెద్దముల్లు, చిన్నముల్లు కౌగిలించుకున్నాయి. గడియారం పన్నెండు గంటలు కొట్టింది.

అందరూ "హేపీ న్యూయియర్" అంటూ, వంకరలు తిరుగుతూ, ప్రక్కనున్న వారితో చేతులు కలుపుతూ, తమ సంతోషాన్ని ప్రకటించారు.

అందరికీ మధ్యలో, ఖరీదైన కాశ్మీరీ తివాసీ మీద నిలబడి ఉంది సినీతార రేరాణి. మత్తు పానీయం ప్రభావం ఆమె కన్నుల్లో కన్పిస్తోంది.

అరుదుగా మత్తు పానీయం సేవిస్తుం దామె. ఆ అరుదైన సమయాలు ఇలాంటివే. కొత్త సంవత్సరంలో కొత్తనిర్ణయం తీసుకోబోతోంది ఆమె. అందుకే అందరికీ ఆహ్వానాలు పంపింది. "కొత్త సంవత్సరంలోకి అడుగిడిన ఈ శుభసందర్భంలో మీ కొక వార్త చెప్పబోతున్నాను" అంది రేరాణి హుందాగా.

అందరూ ఆ వార్త వినటం కోసం ఆమె వైపు కుతూహలంగా చూశారు.


"నేను, నళినీ మోహన్ పెళ్ళి చేసుకోవాలని నిర్ణయించుకున్నాం."

అంతా ఒక్కసారి చప్పట్లు కొట్టారు.

'మేము ఈ వార్త ముందే రాశాం. ఆ రోజు కాదని ఖండించింది. ఈ రోజు అదే వార్త తనే చెబుతోంది' అనుకున్నారు సినీ పరిశ్రమలోని పత్రికా విలేఖరులు.

నిర్మాతల గుండెల్లో గుబులు మొదలైంది. పానీయాల మత్తు దిగిపోయింది. రేరాణితో సినిమా తీస్తే సక్సెస్ కాకపోవటం అంటూ ఉండదు. క్లాస్‌ని, మాస్‌ని అంతలా ఆకర్షించిన నటీమణి రేరాణి. "ఈ రోజు సాయంత్రం ఆరుగంటల కాల్షీట్‌తో నా చిత్రాలన్నీ పూర్తి చేసినట్లే. ఇంక చిత్రాల్లో నటించాలని అనుకోవటం లేదు. భార్యగా, తల్లిగా దాంపత్య జీవితాన్ని అనుభవించాలని అనుకుంటున్నాను." చిరునవ్వుతో అంది రేరాణి.

ఈ మాటలు విన్న కొంతమంది నిర్మాతలు ముఖాలు ముడుచుకున్నారు.




"పెళ్ళి చేసుకునే ముందు అలా అని, మళ్ళీ చిత్రాల్లో ప్రవేశించిన వారెందరు లేరు? అలవాటైన ప్రాణం! ధనం వచ్చి చేతుల్లో పడ్తే కాదంటారా ఎవరైనా?" అనుకున్నారు ఆశావాదులైన నిర్మాతలు కొందరు.

ఆమెను ఒక వ్యక్తిగా, తారగా అభిమానించే కొందరు ప్రముఖులు ఆమె నిర్ణయాన్ని హర్షించారు.

ఆ పార్టీలో అందరికీ ఎడంగా నిలబడి, కన్నీటి ముత్యాల్ని కను కొలకుల్లోనే దాచుకోవాలని ప్రయత్నించే వ్యక్తిని ఎవ్వరూ గమనించలేదు.

ఆమె నళినీమోహన్ భార్య విజయ, ఇలా జరుగుతుందని ఆమె ఎన్నడూ అనుకోలేదు. తన భర్త ఆడవారితో అతి చనువుగా తిరుగుతాడని వింది కాని, మళ్ళీ పెళ్ళి చేసుకుంటాడని ఊహించలేదు. ఆమె కన్నుల్లో కావేరి ప్రవహించింది. గుండెల్లో గోదావరి సుడులు తిరిగింది. ఆమెను గమనించింది రేరాణి.

విజయ హృదయం అగ్ని పర్వతంలా సెగలు కక్కుతోందని పసిగట్టింది. అయినా లెక్కచేయలేదు. అనుకున్నది సాధించా నన్న గర్వంతో రవ్వంత తల ఎత్తి, ఠీవిగా నిబడింది.

కనుకొలకుల్లోంచి రాలిపడుతున్న నీటి ముత్యాల్ని కొనగోటితో తుడుచుకుంది విజయ. ఆ చర్య రేరాణి హృదయంలో, ఎక్కడో ఓ మూల ఉన్న స్త్రీని సున్నితంగా తట్టి లేపింది. తనలోని బాధనంతా కన్నీటితో ఆపుకోగలిగిన ఆమె సంస్కారాన్ని మెచ్చుకుంది. ఒక్క క్షణం బాధ పడింది. అంతలో సర్దుకుని, నలుగురి నవ్వుల్లో పాలుపంచుకుంది.


*** *** *** ***

నళినీమోహన్ మొదటి భార్య రేరాణిని యాగీ పెట్ట లేదు. భర్తను వదిలి పెట్టమని ప్రాధేయ పడలేదు. కోర్టు కెక్కుతానని బెదిరించలేదు.

"నేను వారి భార్యను. మాకు పిల్లలు ఉన్నారు. నా భర్త నన్ను నిర్లక్ష్యం చేసినా, నన్ను కన్నుల్లో దాచుకుని కాపాడే అత్త మామలు ఉన్నారు. చట్ట వరంగా ఈ వివాహం చెల్లదు." - అందామె హుందాగా పత్రికల వారితో.

ఒక ఆడదాని కాపురాన్ని కూల్చిందని, పత్రికలు రేరాణిని ఘాటుగా విమర్శించాయి. చట్ట వరంగా ఆమె నళినీ మోహన్ భార్య కాదని కొన్ని పత్రికలు తీర్పు చెప్పాయి. మొదటి భార్యకు విడాకులు ఇవ్వలేదు కాబట్టి, రేరాణి నళినీ మోహన్ ఉంపుడు గత్తె అని కొన్ని పత్రికలు వెక్కిరించాయి.

ఈ అభిప్రాయాలన్నీ ఖండించింది రేరాణి. "మనసులు కలసి చేసుకున్న వివాహం మాది. ఇన్ని విమర్శలు వస్తాయని నాకు తెలును.అన్నిటికి సిద్ధపడి ఈ వివాహం చేసుకున్నాను. సాటి ఆడదాని కాపురంలో చిచ్చుపెట్టాననటం హాస్యాస్పదం. తన భర్త రెండవ వివాహం చేసుకున్నాడంటే ఆ తప్పెవరిది? మొదటి భార్యదే. ఆమె సరైన ప్రేమను భర్తకు అందివ్వలేదు కాబట్టే వారు నన్ను పెళ్ళి చేసుకున్నారు. ఈ పరిస్థితిలో తలవంచుకోవల్సింది నేను కాదు. నళినీ మోహన్ మొదటి భార్య. చట్టపరంగా నేను వారి భార్యను కాదంటున్నారు. డబ్బు గొడవలు మా మధ్య లేవు. ఆస్తి పంపకాలు ఉంటేనా కదా చట్టంతోపని!" అని పత్రికలకి స్టేట్‌మెంట్ ఇచ్చింది. ఏడాది గడిచింది.



సినీ పరిశ్రమ, రేరాణిని తారగా మరిచిపోయి, ఒక గృహిణిగా గుర్తిస్తున్న సమయంలో....

డిసెంబరు ముప్పై ఒకటవ తేదీ అర్ధరాత్రి, తన సౌధంలోకి, సినీ ప్రముఖుల్ని ఆహ్వానించి. కొత్త సంవత్సరంలోకి అడుగుపెడ్తూ, "మళ్ళీ తిరిగి సినిమాల్లో నటిస్తా"నని ప్రకటించింది రేరాణి.

ఆమె కన్నుల్లో దర్పంలేదు. తను సంపాదించు కున్న డబ్బుకోసమే, తనను పెళ్ళి చేసుకున్నాడనే నిజాన్ని నళినీ మోహన్ నోటి నుంచి విన్నరోజే ఆమె కన్నులు కన్నీటికుండ లయ్యాయి. ఆమె కంఠంలో గర్వం లేదు. మొదటి భార్య ద్వారా ముగ్గురు పిల్లలు పుట్టగానే, ఇంకపిల్లలు పుట్టకుండా నళినీ మోహన్ ఆపరేషన్ చేయించుకున్నాడన్న సంగతి తెలిసిన క్షణంలోనే ఆమె గర్వం గంగలో కలిసిపోయింది. తారాపథంలోకి దూసుకువస్తున్న కొత్త నటితో పరిచయాన్ని పెంచుకుని, తనను నిర్లక్ష్యం చేస్తున్నాడనే వార్త తెలుసుకుని విరక్తిగా నవ్వుకుంది. వేటగాడి చేతిలో దెబ్బతిన్న పిట్టలా ఉందామె. ఆమె తిరిగి చిత్రాల్లో నటిస్తోందని తెలుసుకుని, నిర్మాతలు సంతోషంతో చప్పట్లు కొట్టారు.

ఆ పార్టీలో అందరి మధ్యా ఉన్న నళినీ మోహన్ మొదటి భార్య విజయ వైపు చూసింది. ఆమె కన్నుల్లో భర్తను తిరిగి పొందానన్న గర్వంలేదు. నువ్వు ఓడిపోయావు అన్న అవహేళన లేదు. జాలిగా చూస్తున్నాయామె కళ్ళు.

"తాళి కట్టించుకుని పిల్ల తల్లి నైన పుణ్యానికి సంఘం నన్ను భార్యగా గుర్తిస్తుంది. చట్టం నన్ను రక్షిస్తుంది. మగవాడిని కట్టుకుని నాలుగు గోడలమధ్య నలిగి పోతున్నాను నేను. అతన్నే నమ్ముకుని నలుగురిలో నవ్వుల పాలయ్యావు నువ్వు. మగవాడి నీడలో ఆడదానిగా, మాతృమూర్తిగా జీవితాన్ని అనుభవించాలనుకున్న ఇద్దరం ఓడి పోయాం! ఆడదాన్ని సంఘం గుర్తించాలి. చట్టం రక్షించాలి! మగవాడు మాత్రం మనసున్న మనిషిగా ఆదరించడు, గౌరవించడు.

ఆమె ముఖంలోని భావాల్ని అక్షర రూపంలో చదువుకుంది రేరాణి.